క్లుప్తంగా

భూమిపూజ

చిగురుమామిడి: నిరుపేదలకు ఇళ్లు మంజూరు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని గాగిరెడ్డిపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గు పోశారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఇళ్లు నిర్మించుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శి గొల్లేని సంపత్, నాయకులు పాల్గొన్నారు.

బడిబాట

చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లి, రేకొండ, చిన్నముల్కనూర్ గ్రామాలలో మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. విద్యావాహిని రథం ద్వారా ప్రచారం చేశారు. ఇంటింటికి తిరుగుతూ విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని కోరారు. ఎంఈవో పావని, ఆయా పాఠశాలల హెచ్ఎంలు వాణిశ్రీ, గంగాభవాని, హేమలత,సురేశ్, బానోతు, శారద, శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్లు మావురపు మంగ, విద్యాకమిటీ మాజీ చైర్మన్ బరిగెల సదానందం పాల్గొన్నారు.

వీడ్కోలు హంగామా

హుజూరాబాద్: మండలంలోని సింగాపూర్ కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మిషన్ లెర్నింగ్ ఏఐఎంఎల్, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాల ఫైనలియర్ విద్యార్థులకు మంగళవారం వీడ్కోలు పలికారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.శంకర్ మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ పూర్తి చేసిన విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందుబాటులో ఉన్నాయన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరయ్య, ఇంటెలిజెన్స్ మిషన్ లెర్నింగ్ విభాగాధిపతి డాక్టర్ ప్రవీన్ కుమార్, కార్యక్రమ నిర్వాహకులు, అధ్యాపకుడు రాజశేఖర్, మెకానికల్ ఇంజినీరింగ్ అధ్యాపకుడు వెంకటేష్, వివిధ విభాగాధిపతులు ఉన్నారు.

ప్రత్యేక పారిశుధ్య పనులు

హుజూరాబాద్: పర్యావరణ అనుకూలత నగరాలుగా అభివృద్ధి చేసే వంద రోజుల ప్రణాళికలో భాగంగా పట్టణంలోని 19వ వార్డులో మంగళవారం ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టామని మున్సిపల్ కమిషనర్ కెంసారపు సమ్మయ్య తెలిపారు. వార్డులోని మురుగు కాలువలను శుభ్రం చేయడంతో పాటు సిల్టును, రోడ్ల పక్కన పిచ్చిమొక్కలను తొలగించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు ఆర్.భూపాల్‌రెడ్డి, సాంబరాజు, ఎస్.సుధాకర్, జె. శ్రీకాంత్, రవీందర్, రాజయ్యవినయ్, వార్డు అధికారులున్నారు.

కనీస వేతనం పెంచాలి



ధర్నా చేస్తున్న బీఎంఎస్ నాయకులు

కరీంనగర్: కార్మికులకు కనీస వేతనం రూ.25 వేలు పెంచాలని డిమాండ్ చేస్తూ భారతీయ మజ్దూర్ సంఘ్(బీఎంఎస్) జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. జిల్లా అధ్యక్షుడు పసుల శ్రవణ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాల జీవోలను వెంటనే సవరించి, భవన నిర్మాణ సంక్షేమ బోర్డు నుంచి అక్రమంగా నిధులు స్వాహా చేసిన వారిని శిక్షించి, బీఓసీ బోర్డును ప్రక్షాళన చేసి కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం ఇవ్వాలని కోరారు. ఈఎస్ఐ, పీఎఫ్ కల్పించాలని అన్నారు. జిల్లా కేంద్రంలో వంద పడకలతో ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటు చేసి ఆధునిక వైద్యం అందించాలని కోరారు. కార్యక్రమంలో బీడీ కార్మిక సంఘ్ రాష్ట్ర కార్యదర్శి రేణిగుంట శంకర్, కార్మికులు పాల్గొన్నారు.

నాయకుల సంబరాలు

జమ్మికుంట: ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ టీపీసీసీ ఉపాధ్యక్షుడిగా నియామకమయ్యారు. ఈసందర్భంగా పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద మంగళవారం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎండీ సలీంపాషా ఆధ్వర్యంలో నాయకులు బాణా సంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు

హుజూరాబాద్: అంబేడ్కర్ రాసిన రాజ్యాంగానికి లోబడి పోలీసులు పనిచేయాలని టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ అట్రాసిటీ రాష్ట్ర ఇంచార్జి తిప్పారపు సంపత్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో మాట్లాడారు. సైదాపూర్ మండలానికి చెందిన మహేందర్‌పై ట్రైనీ ఎస్ఐ భార్గవ్, కానిస్టేబుళ్లు ఆకాష్‌రెడ్డి, అజయ్ అకారణంగా దాడికి పాల్పడ్డారని, ఘటనపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా ట్రైనీ ఎస్ఐపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు అయిందని తెలిపారు.

కారు బోల్తా

గంగాధర: మండలంలోని కొండన్నపల్లి బస్టాండ్ సమీపంలో మంగళవారం కారు బోల్తాపడింది. స్థానికులు తెలిపిన వివరాలు.. భూపాలపల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారి సుభాష్‌చంద్రబోస్ నిర్మల్ నుంచి కరీంనగర్ వైపు వస్తుండగా కారు కొండన్నపల్లి శివారులో అదుపు తప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తాపడింది. చుట్టు పక్కల రైతులు, స్థానికులు కారులో ఉన్న వ్యక్తిని బయటకు తీసి కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

ఇటు నీటి ఊట.. అటు చేపల వేట

- ఈజీఎస్ కింద పాంపాండ్ల నిర్మాణం
- పెరగనున్న భూగర్భ జలాలు
- చేపపిల్లల పెంపకంతో ముదిరాజ్‌లకు ఉపాధి
- మండలానికి 42 మంజూరు, ఒక్కో దానికి రూ.లక్ష వ్యయం



చిన్నముల్కనూర్‌లో పాంపాండ్ పనుల్లో కూలీలు

చిగురుమామిడి: భూగర్భ జలాల పెంపకం కోసం మండలంలోని 17 గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద పాంపాండ్ల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఊరచెరువుల్లో వీటిని తవ్వడం వల్ల వర్షపు నీరు నిల్వ ఉంటుంది, దీంతో బావులు, బోర్‌వెల్‌లో నీటి ఊటలు పెరిగి రైతులకు ప్రయోజనం చేకూరే అవకాశం ఉంది. కొన్ని గ్రామాల్లో ముదిరాజ్‌లు చేపపిల్లలను పెంచుతున్నారు. చిగురుమామిడి మండలానికి 2024–25లో 30, 2025–26లో 12 పాంపాండ్లు మంజూరయ్యాయి. ఒక్కో దాని నిర్మాణ వ్యయం రూ.లక్ష కాగా వీటిని లేబర్ కాంపోనెంట్ కిందనే ఖర్చుచేస్తారు. మండలానికి 42 పాంపాండ్లకు రూ.42 లక్షలు మంజూరయ్యాయి. వీటిలో 8 పూర్తికాగా 34 ప్రగతిలో ఉన్నాయి. ఒక్కోదాన్ని నిర్దారించిన పనిదినాల్లో పూర్తిచేయాలి. మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రస్తుతం తక్కువ మంది కూలీలు మాత్రమే ఈజీఎస్ పనులకు హాజరవుతున్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా కూలీల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. దీంతో పాంపాండ్ల పనుల్లో ఆలస్యమవుతోందని ఆయా గ్రామాల ఈజీఎస్ సిబ్బంది తెలిపారు. ఈ నెలలోపూ ప్రగతిలో ఉన్నవి పూర్తిచేయాలనే నిబంధనలున్నప్పటికీ కూలీల కొరతతో సకాలంలో పూర్తయ్యే అవకాశాలు లేవని అంటున్నారు. పాంపాండ్లతో భూగర్భ జలాలు పెరగడంతోపాటు ముదిరాజ్‌లు చేపపిల్లలను పెంచడంతో రెండు విధాలుగా ప్రయోజనం కలుగుతుంది.

నెలలోపు పూర్తిచేస్తాం

భూగర్భ జలాల పెంపునకు చేపట్టిన పాంపాండ్ల నిర్మాణ పనులు ఈ నెలలోపు పూర్తిచేస్తాం. దాదాపు అన్ని ప్రగతిలో ఉన్నాయి. మొన్నటి వరకు కూలీలు ఎండవేడిమికి తట్టుకోలేక తక్కువ సంఖ్యలో పనులకు హాజరయ్యారు. దీంతో పనులు కొంతమేర ఆలసమయ్యాయి.

– రవిరాజు ఈసీ అండ్ ఇన్‌చార్జి ఏపీవో, చిగురుమామిడి



ఓగులాపూర్‌లో పూర్తయిన పాంపాండ్

సాగులో సాంకేతిక పరిజ్ఞానం వినియోగించాలి



మాట్లాడుతున్న కేవీకే శాస్త్రవేత్త శ్రీనివాస్‌రెడ్డి

రామడుగు: ప్రతి రైతు సాగులో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తే మంచి ఫలితాలు సాధించే అవకాశం ఉంటుందని కృషి విజ్ఞాన కేంద్రం జమ్మికుంట శాస్త్రవేత్త శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని వెదిర, వెలిచాల గ్రామాలలో మంగళవారం వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంపై వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు పంటలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, శ్రీధర్ మాట్లాడారు. రైతులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, ప్రకృతిని కాపాడుకుంటూ పంటలు సాగు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ ప్రియదర్శిని, వెదిర పశువైద్యాధికారి మనోహర్, ఏవో త్రివేదిక, ఏఈవోలు గోవర్ధన్, సంపత్ పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

బొమ్మనపల్లి పీహెచ్‌సీలో ‘ఆరోగ్య మహిళ’



ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఆర్డీవో సీహెచ్ రమేశ్‌బాబు, తదితరులు

చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లి ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రంలో మంగళవారం ఆరోగ్య మహిళా కార్యక్రమం నిర్వహించారు. మహిళలకు వివిధ పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. నల్గురుని కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి రెఫర్ చేసినట్లు మెడికల్ ఆఫీసర్ ప్రిసిల్లా తెలిపారు. ఏఎన్ఎంలు ధనలక్ష్మి, స్వరూప, ఆశా వర్కర్లు లింగవ్వ, సుగుణ, సుజాత పాల్గొన్నారు.

హుజూరాబాద్‌రూరల్: ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని హుజూరాబాద్ ఆర్డీవో సీహెచ్ రమేశ్‌బాబు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఆరోగ్య మహిళా కార్యక్రమం ప్రారంభించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకట రమణ, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ నారాయణరెడ్డి మాట్లాడారు. ఆరోగ్య మహిళాలో రూ.40 వేలు ఖర్చయ్యే పరీక్షలు ఉచితంగా చేస్తామని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హుజూరాబాద్ డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌వో డాక్టర్ చందు, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, ఆర్ఎంవో డాక్టర్ రమేష్‌బాబు, డాక్టర్ సనా జువేరియా, ఆసుపత్రి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్యం ప్రభుత్వాల కనీస బాధ్యత

హుజూరాబాద్‌రూరల్: నిరుపేదలకు ఉచిత వైద్యం అందించడం ప్రభుత్వాల కనీస బాధ్యతని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్యం అందించినప్పుడే సర్కార్ దవాఖానాలపై ప్రజలకు నమ్మకం ఏర్పడుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం హుజూరాబాద్ బీజేపీ నాయకులతో కలిసి పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిని సందర్శించారు.

కాషాయ జెండా ఎగరేయాలి

హుజూరాబాద్: రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాషాయ జెండా ఎగిరేలా ప్రతి నాయకుడు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణ అధ్యక్షుడు తూర్పాటి రాజు ఆధ్వర్యంలో శిశుమందిర్‌లో బూత్ అధ్యక్షుడు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. పీఎం మోదీ పాలనలో భారతదేశం అన్ని రంగాల్లో పరుగులు పెడుతుందన్నారు. పార్టీ బలోపేతానికి, ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించేలా పనిచేయాలన్నారు. అనంతరం మొక్కలు నాటారు.


స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

శంకరపట్నం: స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధగా ఉండాలని బీజేపీ జిల్లా కార్యదర్శి నరసింహరాజు అన్నారు. కేశవపట్నంలో బూత్‌స్థాయి అధ్యక్షులు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ప్రధాని మోదీ పాలనలో దేశం సుస్థిరంగా ఉందని, రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీ అని అన్నారు.

ఆపరేషన్ సిందూర్ చారిత్రాత్మక విజయం

ఇల్లందకుంట: పీఎం మోదీ 11 ఏళ్ల పాలన స్వర్ణయుగం అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఓదెలు అన్నారు. ఇల్లందకుంటలో పార్టీ మండలశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మండల అధ్యక్షుడు రమణారెడ్డి మాట్లాడుతూ.. పీఎం మోదీ పాలనలో భారత్ అభివృద్ధి, స్వావలంబన వైపు పురోగమిస్తుందని, ఆపరేషన్ సిందూర్ చారిత్రాత్మక విజయమని యావత్ దేశం గర్విస్తోందని కొనియాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీ విజయం సాధిస్తుందని కార్యకర్తలు, నాయకులు ప్రజాసమస్యలపై పోరాడుతూ వారికి అందుబాటులో ఉండాలని కోరారు.

ఫైర్ సేఫ్టీపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

రామడుగు: వెదిర గ్రామం అల్ఫోర్స్ స్కూల్‌లో మంగళవారం అగ్ని ప్రమాదాల నివారణ, జాగ్రత్తలపై ఎన్‌సీసీ కెడెట్లకు కల్నల్ ఆఫీసర్ ఏకే జయంతి, కరీంనగర్ ఫైర్ ఆఫీసర్ రాజునాయక్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అడ్మిన్ ఆఫీసర్ వి.కృష్ణ, సబ్‌మేజర్ సాగర్‌సింగ్, అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ జన్మదిన వేడుకలు



హుజూరాబాద్‌లో కేక్ కట్ చేస్తున్న నాయకులు

హుజూరాబాద్: పట్టణంలోని అంబేడ్కర్ కూడలి వద్ద మానకొండూరు ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ జన్మదిన వేడుకలను యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పంజాల అరవింద్ ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు.

ఇల్లందకుంట: కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇంచార్జి వొడితెల ప్రణవ్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది కుమార్ ఆధ్వర్యంలో నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నంలో కాంగ్రెస్ పార్టీ మండలశాఖ ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి,స్వీట్లు పంపిణీ చేశారు. మాజీ జెడ్పీటీసీశ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షుడు బస్వయ్య, మార్కెట్ వైస్ చైర్మన్ తిరుపతి, నాయకులు పాల్గొన్నారు.

గన్నేరువరం: మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.

రెవెన్యూ సదస్సు సందర్శన

జమ్మికుంటరూరల్: మండలంలోని వావిలాలలో తహసీల్దార్ నల్ల వెంకటరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సును హుజూరాబాద్ ఆర్డీవో రమేష్‌బాబు మంగళవారం పరిశీలించారు. వివిధ భూ సమస్యలపై 221 దరఖాస్తులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో నయాబ్ తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐలు సత్యనారాయణ, శంకర్, ఎంపీఎస్‌వో, సర్వేయర్, సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల్లో 121 దరఖాస్తులు

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ రైతు వేదికలో అధికారులు మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో 121 మంది రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. భూభారతి చట్టం అమలులోకి రావడంతో సమస్యలున్న రైతులు తహసీల్దార్ సురేఖకు విన్నవించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పార్థసారధి, ఆర్ఐలు బాలకిషన్, ప్రత్యూష, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పెంచిన బస్ చార్జీలను తగ్గించాలి

సైదాపూర్: ప్రభుత్వం పెంచిన ఆర్టీసీ బస్ చార్జీలను తగ్గించాలని పీడీఎస్‌యూ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి కూతాటి రాణాప్రతాప్ మంగళవారం ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు.

జవాన్‌కు సన్మానం



హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ఆర్మీ జవాన్ రామారపు తిరుపతిని వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య మాట్లాడుతూ.. దేశం కోసం ఆర్మీ జవానులు ప్రాణాలకు తెగించి పోరాడటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త రవీందర్‌రావు, శ్రీనివాస్, వాకర్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, ప్రముఖులు పాల్గొన్నారు.

అడ్మిషన్లు ప్రారంభం

జమ్మికుంట: పట్టణంలోని మానసిక దివ్యాంగ విద్యార్థుల ప్రత్యేక పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని పాఠశాల వ్యవస్థాపకుడు సూత్రపు బుచ్చిరాములు మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఐదు నుంచి ముప్పై ఏళ్ల లోపు దివ్యాంగులు ప్రవేశం పొందవచ్చాన్నారు. విద్యార్థులకు హాస్టల్ వసతి ఉంటుందన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించాలి

రామడుగు: ప్రతీ గ్రామంలో జూలై 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరుపుకోవాలని, దండోరా జెండాలను ఆవిష్కరించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇంచార్జి మంద రాజుమాదిగ, జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ మాదిగ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో మంగళవారం ఎమ్మార్పీఎస్ కార్యకర్తల సమావేశం కొత్తూరి రాజన్న అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు శంకర్, హన్మయ్య, శ్రీనివాస్, రవి, అనిల్, స్వామి, నర్సింగం, రమేశ్ పాల్గొన్నారు.

లైబ్రరీకి పుస్తకాలు అందజేత



పుస్తకాలు అందజేస్తున్న దాతలు

హుజూరాబాద్: పట్టణంలోని అంగన్‌వాడీ టీచర్ కోటోజు జ్యోతిరాణి కుమారుడు సాయికిరీటి జన్మదినం సందర్భంగా లైబ్రరీకి రూ.10వేల విలువ చేసే పుస్తకాలను మంగళవారం అందజేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, మేనేజర్ రావుల భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఔషధ మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆయుర్వేద వైద్యులు సుధాకర్, అంగన్‌వాడీ టీచర్లు సుకన్య, సబిత, ఫాతిమా, వార్డు అధికారులు నూనె రమేశ్, రొడ్డ సురేశ్, అందె రవీందర్, వెంకటరమణ, రజిత, నాగమణి, అనూష, యాదగిరి, హర్షవర్ధన్, సత్యరాజు, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.



రామడుగు: మండలంలోని వెదిర వివేకానంద చౌరస్తా నుంచి గోపాల్‌రావుపేట వెళ్లే ప్రధాన రోడ్డులో వెంకటగిరి సమీపంలోని పోచమ్మ దేవాలయం వద్ద ఎండిన చెట్టు ప్రమాదకరంగా ఉంది. ఎప్పుడు పడిపోతుందోనని వాహనదారులు, ప్రయాణికులు భయపడుతున్నారు. సంబంధిత అధికారులు తక్షణం స్పందించి ఎండిన చెట్టును తొలగించాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
రాజేశ్వరి, ఎంపీడీవో, రామడుగు సెల్ నం : 96403 33888

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి ‘సాక్షి’ కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

పోచమ్మ బోనాలు, ఎల్లమ్మ పట్నాలు



మొక్కలు చెల్లించుకుంటున్న ఎమ్మెల్యే సత్యం



మాదాపూర్‌లో పోచమ్మ బోనాలతో మహిళలు

రామడుగు: మండలంలోని చిప్పకుర్తి, రాంచంద్రాపూర్ గ్రామాల్లో గౌడ కులస్థుల ఆధ్వర్యంలో మంగళవారం శ్రీరేణుకా ఎల్లమ్మతల్లి బోనాలు, పట్నాలు ఘనంగా నిర్వహించారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం వేడుకల్లో పాల్గొని ఎల్లమ్మ తల్లికి మొక్కలు చెల్లించుకున్నారు. దేవాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు జవ్వాజీ హరీశ్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పులి ఆంజనేయులుగౌడ్, నాయకులు మల్లేశం, తిరుపతి, హన్మంతు, రాంచంద్రారెడ్డి, అజయ్ గౌడ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

గన్నేరువరం: మండలంలోని మాదాపూర్‌లో మంగళవారం గ్రామస్తులు పోచమ్మ బోనాలు నిర్వహించారు. మహిళలు నెత్తిన బోనంతో డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో బ్రిడ్జి జేఏసీ చైర్మన్ సంపతి ఉదయ్‌కుమార్, మాజీ సర్పంచ్ కుమ్మరి సంపత్, కుమ్మరి శంకర్, సంపతి శ్రీనివాస్, సంపతి వెంకటయ్య, సంపతి కొమురయ్య, సంపతి మొండయ్య, నవ్వుండ్ల కొమురయ్య, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పదవి రాకుండా అడ్డుకున్నారు

కవ్వంపల్లి అనురాధ



మాట్లాడుతున్న కవ్వంపల్లి అనురాధ

తిమ్మాపూర్: ఒకరిని తొక్కేయాలనుకోవడం బలం కాదు, బలహీనతేనని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సతీమణి డా.అనూరాధ స్పష్టం చేశారు. మంగళవారం అల్గునూరులోని ఉన్నతి కన్వెన్షన్ హాల్‌లో ఎమ్మెల్యే జన్మదిన వేడుకల్లో కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. కవ్వంపల్లి కుటుంబం ఎన్నో ఆటుపోట్లు, అవరోధాలను అధిగమించిందని, మంత్రి పదవి రాకుండా అడ్డుకున్న వారిపై విమర్శలు గుప్పించారు. ప్రజాభిమానంతో ఎదిగే వారిని ఎవరూ అణచివేయలేరని, రాజకీయ రంగంలోకి అడుగుపెట్టాక అనేక అవకాశాలు కోల్పోయి ఇబ్బందులు ఎదుర్కొన్నామన్నారు. ప్రత్యర్థులు దుష్ప్రచారం చేసినా క్లిష్ట పరిస్థితుల్లో ప్రజలు, కార్యకర్తలు అండగా నిలిచారని గుర్తు చేసుకున్నారు. ప్రజలు, కార్యకర్తల కోసం సేవ చేయాల్సిన బాధ్యత తమపై ఉందని పేర్కొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు.

పీసీసీ కార్యదర్శులుగా జిల్లా నుంచి నలుగురు



గజ్జెల కాంతం



కాశిపాక రాజేశ్



రహమత్‌హుస్సేన్



రుద్ర సంతోష్

కరీంనగర్ కార్పొరేషన్: పీసీసీ ప్రధాన కార్యదర్శులుగా జిల్లా నుంచి నలుగురికి చోటు లభించింది. పీసీసీ ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యక్షులను నియమిస్తూ ఏఐసీసీ ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. కరీంనగర్ జిల్లా నుంచి నలుగురిని ప్రధాన కార్యదర్శులుగా నియమించింది. నగరానికి చెందిన గజ్జెల కాంతం, రహమత్ హుస్సేన్, కాశిపాక రాజేశ్, గంగాధర మండలానికి చెందిన రుద్ర సంతోష్‌లు ఉన్నారు. నలుగురిలో ఇద్దరు ఎస్సీ, ఒక బీసీ, ఒక మైనార్టీ. గజ్జెల కాంతం ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్‌గా, దళిత సంఘాల నాయకుడిగా గుర్తింపు పొందారు. అలాగే రహమత్ హుస్సేన్ గతంలోనూ పీసీసీ కార్యదర్శిగా పనిచేశారు. కాగా ఎన్ఎస్‌యూఐ నుంచి ఎదిగిన బొమ్మకల్ లోని కృష్ణానగర్‌కు చెందిన కాశిపాక రాజేశ్‌కు అనూహ్యంగా పీసీసీ ప్రధాన కార్యదర్శి పదవి దక్కింది. అదేవిధంగా ఏఐసీసీ ఆదేశాల మేరకు రాష్ట్రంలో పార్టీ కార్యక్రమాల నిర్వహణల బాధ్యతలు నిర్వర్తించే రుద్ర సంతోష్‌కు పీసీసీ కార్యవర్గంలో చోటు లభించింది.

కళాకారులను మర్చిపోవడం దురదృష్టకరం

కరీంనగర్‌కల్చరల్: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం కోసం పోరాడిన సాహితీ, సాంస్కృతిక విభాగాల కళాకారులను ప్రభుత్వాలు మర్చిపోవడం దురదృష్టకరం అని కవి,గాయకుడు నేర్నాల కిశోర్ ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో అర్హతలు ఉన్న వారిని పక్కనపెట్టి, అనర్హులకు ఉద్యోగాలు ఇచ్చిన తీరు అత్యంత దౌర్భాగ్యకరమన్నారు. మంగళవారం ఫిలింభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 15న కరీంనగర్ కళాభారతిలో ‘పాటల పల్లకిలో 12 గంటలు’ పేరుతో సాంస్కృతిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన కళాకారులకు ఉద్యోగాలు కల్పించేందుకు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ సాంస్కృతిక సేన రాష్ట్ర అధ్యక్షుడు చక్రాల రఘు, సినీ రచయిత గుండేటి రమేశ్, పలువురు కళాకారులు పాల్గొన్నారు.